
# అభద్రతా భావం




*యది కర్దమభయోత్పుత*
*పద మిద మలసయా తవ పదే లగ్నం*
*తత్సుభగ కంటకిత*
*మంగమిదానాం కిమితి వహసి*

**భావం:** ఓ అందగాడా, బురదలో పడిపోతానన్న భయంతో ఆమె నీ అడుగులో అడుగు వేసి నడుస్తుంటే, నీ ఒళ్ళు పులకాంకితమై పోవడం ఏమిటి?

భార్యా రూపవతీ శత్రుః అన్నది అందరికీ తెలిసిన సామెతే. అందమైనభార్య ఉంటే మనశ్శాంతి ఉండదు. ప్రతి మగాడి చూపూ ఆమె మీదే ఉంటుంది. ఆమెతో మాటా మనస్సూ కలపాలని ప్రయత్నించే వారితోభర్తకి గొడవ తప్పనిసరి . భార్య కూడా తనతో మాట కలిపే వారిపై మనస్సు పడుతుందేమో నన్న భయముంటుంది. అందగత్తె భర్తకి భయమూ,

అసూయా ఉంటాయి. అందుకే ఆ సామెత పుట్టింది. అయితే ఆడవాళ్ల సంగతి పట్టించుకోరా అనే స్త్రీ వాదుల కోసం ఈ కథ.

మహేశుడు ఆరడుగుల అందగాడు. అతనికి శశిరేఖతో వివాహమైంది. శశిరేఖ కూడా బాగుంటుంది. కానీ అతని ముందు దిగదుడుపే. వివాహ సమయంలో శశిరేఖ స్నేహితురాళ్ళందరూ ఆమె అదృష్టాన్ని పొగిడారు. ఆమె ఆనందించింది. కానీ పెళ్ళైన కొన్ని రోజులకే అందగాడైన భర్త ఉండడంలోని కష్టం తెలిసింది. ప్రయాణాలలో, పెళ్ళిళ్ళలో, ఉత్సవాలలో ఆడవారి కళ్ళు మహేశుడి మీదే ఉండేవి. అతనితో మాట కలపడానికీ, ఆకర్షించడానికీ అమ్మాయిలు ప్రయత్నించేవారు. వారి ప్రయత్నాలు సఫలమయ్యాయో లేదో శశిరేఖకు తెలియదు. కానీ భర్త దూరమవుతాడన్న అభద్రతాభావంతో ఆమె బాధ పడేది.

ఒకసారి ఆమె అనుమానం నిజమయ్యే పరిస్థితి ఎదురైంది. పడవ ప్రయాణంలో ఒకమ్మాయి మహేశుడితో మాట కలపడానికి ప్రయత్నించింది. కానీ శశిరేఖ పడనివ్వలేదు. ఆ అమ్మాయి ఎలాగైనా మహేశుడితో మాట్లాడాలనుకుంది. పడవ ప్రయాణం పూర్తయ్యింది. అందరూ పడవ దిగి రేవులో నడవసాగారు. ఆమె బురదలో నడవడం కష్టం అన్న సాకుతో మహేశుడితో అడుగులో అడుగు వేసి నడవసాగింది. కానీ నడక పూర్తయ్యేలోగానే శశిరేఖకు విషయం తెలిసింది. ఆమె కోపంగా వారి దగ్గరకు వెళ్ళింది. అమ్మాయి వెనక్కు తగ్గింది. శశిరేఖ భర్తను 'ఎవరామె' అంది. మహేశుడు ' ఆమె ఎవరో తెలియదు. బురదలో జారిపడిపోతునన్న భయంతో నా అడుగులో అడుగు వేసి నడిచింది." అన్నాడు. శశిరేఖ ' అందగాడా, నువ్వన్నది నిజమే అయితే నీ శరీరం పులకించిందేం' అంది. భార్యకి ఎంత అనుమానం ఎంత అభద్రతా భావం భర్తకి ఎంత అశక్తత.

భర్తా రూపయుతః శత్రుః అన్న సామెత కూడా ఉంటే స్త్రీ వాదుల సమానత్వ సిద్ధాంతాన్ని గౌరవించినట్లువుతుంది కదా.

******